నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 4 | సంచిక: 353 | బుధవారం, 20 మే 2026 | పేజీలు - 8 | వెల : 3/-




## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..నిరుద్యోగులకు గుడ్ న్యూస్




**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వయోపరిమితిని మరో పదేళ్లకు పెంచింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సాధారణ ఉద్యోగాల కోసం గరిష్ట వయోపరిమితి 34 సంవత్సరాలుగా ఉంది. కాగా, తాజా ఉత్తర్వులతో ఈ వయోపరిమితి 44 ఏళ్లకు పెరిగింది. ఈ వయో సడలింపు ఏడాది పాటు అమలులో ఉండనుంది. నిరుద్యోగ యువత నుంచి పెద్ద ఎత్తున వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కరోనా కాలం, నియామకాల ఆలస్యం, నోటిఫికేషన్లు లేకపోవడం వంటి పలు కారణాల వల్ల చాలామంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయారని.. వారికి మరో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ నియామక సంస్థలు విడుదల చేసే నోటిఫికేషన్లకు ఈ వయోసడలింపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో తెలిపారు. అయితే ఈ సడలింపు యూనిఫాం సర్వీసులకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేశారు. పోలీస్, ఎక్సైజ్, ఫైర్, జైలు, అటవీ శాఖల వంటి శారీరక ప్రమాణాలు అవసరమైన ఉద్యోగాలకు ఈ వయోపరిమితి పెంపు వర్తించదని పేర్కొన్నారు.

## రేపు మెడికల్ షాపుల బంద్

- **ఆన్‌లైన్ మెడిసిన్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసన**
- **జీవో 220(ఈ) రద్దు, జీవో 817 (ఈ)ని సవరించాలని డిమాండ్**
- **రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కానున్న 45వేల మెడికల్ షాపులు**
- **ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే నిరవధిక ఆందోళన**



## మంత్రుల కమీషన్ కోసమే ధాన్యం కటింగ్

**సివిల్ సప్లై శాఖ మంత్రికి సోయి లేదు..: మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి**

**ధాన్యం కొనుగోళ్లు వేగవేంతం చేయాలని ధర్నా**



**నల్లగొండ వాస్తవ తెలంగాణ** మంత్రులకు కమీషన్ ఇచ్చేందుకే రైతుల ధాన్యంలో మిల్లర్లు కటింగ్ చేస్తున్నారని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలంటూ డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యం లో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం రైతులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రుల కు తెలిసే ధాన్యంలో కటింగ్ పెడుతున్నారని, మిలర్ల వద్ద కమీషన్లు తీసుకోవడానికే వారు మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ రాకముందు రైతులు ధర్నా చేయని రోజూ లేదని, మళ్లీ 12 ఏండ్ల తర్వాత అదే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ వల్ల రైతులు మళ్లీ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ సప్లై శాఖ మంత్రికి సోయి లేదని.. కనీసం రివ్యూ చేసే తీరిక లేదని విమర్శిం చారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటుంటే పట్టడం లేదు.. క్వింటాల్‌కు పది కిలోలు కట్ చేస్తున్నా మంత్రులు అడ్రస్ లేరని ఎద్దేవా చేశారు. జిల్లాకు చెందిన ఇద్దరూ మంత్రులకు ఎలా దోచు కోవాలి.. దాచుకోవాలనే ధ్యాసనే ఉందన్నారు. మోడీ- చంద్రబాబుకు పుట్టిన హైబ్రిడ్ కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉన్నదన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లా డుతూ.. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతుంటే.. కల్లాల వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు హైడ్రామా చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనిపించారన్నారు. రైతుల పక్షాన ఇందిరాపార్క్ వద్ద ధర్నా.. ఢిల్లీలో ధర్నా చేసి కేంద్రం మెడలు వంచి కొనిపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ జిల్లాధ్యక్షులు రవీంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, గాదరి కిశోర్ కుమార్,చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బత్తుల అనంతరెడ్డి, రావుల శ్రీనివాసరెడ్డి, తండు సైదులు పాల్గొన్నారు.

## ఓయూపై సీఎం రేవంత్ ప్రత్యేక ఫోకస్..

- **ఇప్పటికే రూ.వెయ్యి కొట్ల కేటాయింపు.. నేడు సీఎం నాన్ నెట్ ఫెలోషిప్స్**
- **సింగరేణి సహకారంతో 143 మంది పరిశోధకులకు ఆర్థిక చేయూత**
- **నెలకు రూ.5 వేల చొప్పున 3 ఏండ్లు ఫెలోషిప్స్**

**వాస్తవ తెలంగాణ** ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ఓయూ పూర్వ వైభవం కోసం రూ.1000 కోట్ల నిధులు ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు పరిశోధనలపై ఆసక్తి ఉన్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు "సీఎం నాన్-నెట్ ఫెలోషిప్స్" ద్వారా చేయూత అందించడానికి ఏర్పాట్లు చేసింది. ఓయూలోని 12 డీన్స్ పరిధిలో పరిశోధనలు చేస్తున్న కేటగిరీ-2 పీహెచ్‌డీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి నాన్-నెట్ ఫెలోషిప్ పథకాన్ని ఓయూ వీసీ ప్రొ.కుమార్ ప్రారంభించారు. అర్హత సాధించిన 143 మంది పరిశోధక విద్యార్థులకు నెలకు రూ.5 వేల చొప్పున మూడు ఏండ్ల పాటు ఉపకార వేతనాలు అందించే ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి కాలరీస్ లిమిటెడ్.. ముఖ్యమంత్రి పేరుతో ఫెలోషిప్స్ అందించేందుకు రూ.కోటి విరాళం అందజేసింది. సుమారు 200 మంది పరిశోధక విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలగనుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చిత్తశుద్ధి, క్రమశిక్షణతో పరిశోధనలు పూర్తి చేయాలని, ఓయూ విద్యార్థులు అంతర్జాతీయ గుర్తింపు కలిగిన



పరిశోధనా పత్రాలను ప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఓయూ అధికారులు ఆకాంక్షిస్తున్నారు.

**అదనపు కంటింజెన్సీ నిధులు**

సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలు చేస్తున్న విద్యార్థుల కు ఉపకార వేతనాలకు అదనంగా ఏటా రూ.6 వేల చొప్పున, సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ విభాగాల పరిశోధ నలకు రూ.8 వేల చొప్పున కంటింజెన్సీ నిధులు అందిం చనున్న ట్టు ఓయూ వీసీ తెలిపారు. ఈ పథకాల కోసం ఏటా మొత్తం రూ.1.32 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగించుకోవాలని సూచించారు.

**వీసీ చొరవతోనే సాధ్యమైంది ?రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి**

సీఎం నాన్-నెట్ ఫెలోషిప్స్ పొందే విద్యార్థులకు కనీసం 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి పరిశోధన పురోగతి నివేదిక సమర్పించాలని సూచించారు. ఇతర ఫెలోషిప్స్ పొందుతున్న విద్యార్థులు ఈ పథకానికి అనర్హులని, పరిశోధన తోపాటు కనీసం రెండు పబ్లికేషన్స్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో నాన్-నెట్ ఫెలోషిప్స్ అందిస్తున్న తొలి యూనివర్సిటీ ఉస్మానియా యూనివర్సిటీనే అని రిజిస్ట్రార్ తెలిపారు. 2025లో అర్హులైన ప్రతి విద్యార్థికీ ఫెలోషిప్స్ అందించామరని చెప్పారు. త్వరలోనే పీహెచ్‌డీ కేటగిరీ-2 నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. ఇటీవల కేటగిరీ-1లో 366 ఖాళీలకు పీహెచ్‌డీ నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ప్రతి విద్యా సంవత్సరం పీహెచ్‌డీ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఓయూ వీసీ ప్రొ. కుమార్ ప్రత్యేక చొరవతోనే ఇవ్వన్నీ సాధ్యం అవుతున్నట్టు చెప్పారు.

## కేబీఆర్ పార్క్‌లోచెట్ల నరికివేతపై సుప్రీం స్టే

**రోడ్డు విస్తరణ పనులపై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు**

**ఎకో సెన్సిటివ్ జోన్ కుదింపు, నిబంధనల ఉల్లంఘనపై వివరణ ఇవ్వాలని ఆదేశం**

**తదుపరి విచారణ జులై 27కు వాయిదా**

2



## ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం కొత్త హెల్త్ స్కీమ్

**హైదరాబాద్ :వాస్తవ తెలంగాణ** ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా "ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్"ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను




ప్రారంభించింది. ఆర్థిక శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగుల వివరాలను ఐఎఫ్ఎంఐఎస్-హెచ్ఆర్ పోర్టల్లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోగా సమాచారం నమోదు చేయాలని లేదంటే భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## వీధి కుక్కల దాడులు..సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ :వాస్తవ తెలంగాణ** దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడులు, కుక్క కాటు ఘటనలపై సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై నుంచి వీధి కుక్కలను తొలగించాలంటూ 2025 నవంబర్‌లో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టివేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ అంశాన్ని విచారించాయి.ప్రజా రవాణా కేంద్రాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వంటి బహిరంగ ప్రదేశాల నుంచి మున్సిపల్ అధికారులు పట్టుకెళ్లే వీధి కుక్కలను.. కుటుంబ నియంత్రణ ఇంజెక్షన్, వ్యాక్సినేషన్ చేసిన తర్వాత మళ్లీ అదే ప్రాంతాల్లో వదిలిపెట్టొద్దని గతంలో కోర్టు ఆదేశించింది. అయితే ఇలా వాటి స్థానాన్ని మార్చడం వల్ల అవి గందరగోళానికి గురై ఎక్కువ దాడులు చేసే ప్రమాదం ఉందంటూ జంతు హక్కుల కార్యకర్తలు కోర్టును ఆశ్రయించారు. కానీ ఈ వాదనతో ధర్మాసనం విభేదించింది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కల సంచారం "ఆందోళనకరంగా" మారిందని స్పష్టం చేసింది. వీధి కుక్కలు ప్రజలపై, ముఖ్యంగా చిన్న పిల్లలపై దాడులు చేస్తూ ముఖాలను సైతం పీకేస్తున్న దారుణమైన ఘటనలను తాము చూస్తూ ఊరుకోలేమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. 'యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా' రూపొందించిన 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' ప్రకారం.. పట్టుకున్న కుక్కలను శాశ్వతంగా జంతు సంరక్షణ కేంద్రాలకే పరిమితం చేయాలని ఆదేశించింది. వాటిని తిరిగి రోడ్లపైకి వదలొద్దని సూచించింది. ఈ నిబంధనలను ఉల్లంఘించే అధికారులపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# రేపు మెడికల్ షాపుల బంద్



**వాస్తవ తెలంగాణ** అఖిల భారత ఔషధ వ్యాపారుల సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా రేపు మెడికల్ షాపులు బంద్ పాటించనున్నాయి. ఆన్‌లైన్ మందుల విక్రయాలకు నిరసనగా ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) పిలుపు మేరకు తెలంగాణలోని సుమారు 45వేల మెడికల్ షాపులు ఒక్క రోజు బంద్‌లో పాల్గొననున్నాయి. ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న ఎమర్జెన్సీ ఫార్మసీలు మాత్రం తెరిచి ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అత్యవసర మందులను వినియోగదారులు ముందుగానే కోనుగోలు చేసుకోవాలని తెలంగాణ కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కోరింది.

**ఆన్‌లైన్ ఫార్మసీ నియంత్రణకు డిమాండ్**

మెడికల్ షాపులతోపాటు కొన్ని ఔషధ సరఫరా సంస్థలు కూడా ఈ బంద్‌లో పాలుపంచుకోనున్నాయి. పెద్ద కార్పొరేట్ కంపెనీల అండదండలతో నడుస్తున్న ఆన్‌లైన్ ఫార్మసీలు భారీ డిస్కౌంట్లు ఇస్తూ సంప్రదాయ మెడికల్ షాపులకు నష్టం కలిగిస్తున్నాయని కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఫార్మసీలు ఈ పోటీని తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, ఆన్‌లైన్ ఫార్మసీని నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆన్‌లైన్ కంపెనీలు తక్కువ ధరలకు మందులను అమ్మడం వల్ల స్థానిక వ్యాపారులు నష్టపోతున్నారని ఆరోపిస్తు న్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్లు మిస్ యూజ్ అవుతున్నాయని, డ్రగ్స్ కూడా విచ్చవిలవిడిగా ఆన్‌లైన్‌లో విక్రయాలు అవుతున్నాయరని ఆరోపించారు. కార్పొరేట్ సెక్టార్లు ఇస్తున్న డిస్కౌంట్లను నియంత్రించాలని, ధరల నియంత్రణలో నిబంధనలు పాటించ కుండా నేషనల్ ప్రైజ్ అథారిటీ ప్రకారం విక్రయాలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**టీటీసీడీఏ సంపూర్ణ మద్దతు**

రేపటి బంద్ కు తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ (టీటీసీడీఏ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్స్ ద్వారా ఎలాంటి భౌతిక తనిఖీల్లేకుండా మందులను విక్రయించడం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒకే ప్రిస్క్రిప్షన్‌ను పలుమార్లు ఉపయోగించి మందులు పొందే అవకాశం ఉండటంతో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్లతో మందులను విక్రయిస్తూ మార్కెట్ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని, దీనివల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలందిస్తున్న చిన్న మెడికల్ షాపుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని టీటీసీడీఏ ఆవేదన వ్యక్తం చేసింది. కోవిడ్ సమయంలో అత్యవసర పరిస్థితుల కోసం జారీ చేసిన జీవో 220(ఈ)ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, ఈ-ఫార్మసీల జీవో 817 (ఈ)ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఆన్‌లైన్ విక్రయాలపై ప్రభుత్వం కఠిన నిబంధనలు తీసుకురాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని అసోసియేషన్ హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఆన్‌లైన్ మందుల అమ్మకాలు, కార్పొరేట్ చైన్ ఫార్మసీలు ఇస్తున్న భారీ డిస్కౌంట్లతో సాధారణ రిటైల్, ల్‌సేల్ కెమిస్టులు తీవ్రంగా నష్టపోతున్నారని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది చిన్న, మధ్య తరహా వ్యాపారులు నిలదొక్కుకోవడం కష్టంగా మారిందని తెలిపింది. ఈ బంద్ సమయంలో అత్యవసర మందుల కొరత లేకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర మందులను ముందే కొనిపెట్టుకోవాలని టీటీసీడీఏ విజ్ఞప్తి చేసింది.

**ప్రధాన డిమాండ్లు ఇలా..**

1.కార్పొరేట్ సంస్థల అనైతిక డిస్కౌంట్లను ఆరికట్టేందుకు 'లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ' విధానాన్ని అమలు చేయాలి.

2.ఫార్మా రంగంలో పారదర్శకత, నైతిక వ్యాపార ప్రమాణాలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలి

3.ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంల ద్వారా జరిగే అక్రమ మందుల అమ్మకాలను పూర్తిగా నిరోధించి, నకిలీ నాణ్యత లేని మందుల సరఫరాను అడ్డుకోవాలి

4.ఆన్‌లైన్, చైన్ ఫార్మసీల అనైతిక డిస్కౌంట్ విధానాలపై నియంత్రణ తీసుకురావాలి.

5.చిన్న తరహా రిటైల్ వ్యాపారుల మనుగడను కాపాడేలా ట్రేడ్ మార్జిన్లను రక్షించాలి

**ఇది కేవలం వ్యాపార సమస్య కాదు**

అరుగొండ శ్రీధర్‌గుప్తా, అధ్యక్షులు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, హైదరాబాద్ జిల్లా ఇది కేవలం వ్యాపార సమస్య కాదు. ఆరోగ్య భద్రతకు సంబంధించిన విషయం కూడా. ప్రభుత్వం ఈ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ప్రజారోగ్య పరిరక్ష దృష్ట్యా వేం నిరవధిక ఆందోళనకు దిగాల్సి వస్తుంది. అక్రమ ఈ-ఫార్మసీలు ప్రజారో గ్యానికి ముప్పు. ఏఐ ఆధారిత నకిలీ ప్రిస్క్రిప్షన్ల ద్వారా యంటీబయోటిక్స్, అలవాటు చేసే మందులు నియంత్రణ లేకుండా అందుబాటులోకి రావడం వల్ల యాంటీమైక్రోబియల్ రెసిస్టన్స్ (ఏఎంఆర్) వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఈ బంద్‌కు మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలి.

# కేబీఆర్ పార్క్ లోచెట్ల నరికివేతపై సుప్రీం స్టే

**న్యూఢిల్లీ వాస్తవ తెలంగాణ** కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్క్ చుట్టూ ఎట్టి పరిస్థితుల్లో చెట్లను నరికివేయొద్దని సర్వోన్నత్య న్యాయస్థానం ఆదేశించింది. ప్రధానంగా ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) పరిధిలో చెట్లను నరికివేయడంపై స్టే విధించింది. పార్క్ పర్యావరణ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాస్తవ బఫర్ జోన్ అయిన 25 నుంచి 35 మీటర్ల పరిధిలో ఎలాంటి చెట్ల నరికివేత చేపట్టరాదని తేల్చి చెప్పింది. తక్షణమే ఆ పనులను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎకో సెన్సిటివ్ జోన్ కుదింపు, నిబంధనల ఉల్లంఘనపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ... విచారణ వాయిదా వేసింది. కేబీఆర్ పార్క్ ఎకో సెన్సిటివ్ జోన్ లో చెట్ల నరికివేస్తున్నారని కాజల్ మహేశ్వరి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ పార్క్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నియంత్రణ నిర్మాణ పనుల చేపట్టిందని పిటిషన్ లో ఆరోపించారు. దీని కారణంగా పర్యావరణానికి శాశ్వత నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అందువల్ల ఈ పిటిషన్ పై తక్షణ జోక్యం చేసుకొని చెట్ట నరికివేతను అడ్డుకోవాలని కోరారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు ... స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఎలాంటి పనులు చేపట్టవచ్చు? ఏయే పనులు నియంత్రించాలి? లేదా నిషేధించాలి? అనే అంశాలపై పరిశోధన చేసి వివరాలు సమర్పించాలని కోర్టు పిటిషనర్లనే ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. హైకోర్టు జారీ చేసిన ఈ ఉత్తర్వులపై పిటిషనర్ కాజల్ మహేశ్వరి 22 ఏప్రిల్ 2026న సుప్రీంకోర్టులో సవాల్ చేవారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపున సీనియర్ అడ్వొకేట్ కె.వివేక్ రెడ్డి, అడ్వొకేట్ లు మిథున్ శశాంక్, మనీశ్ తివారీ వాదనలు వినిపించారు. హైదరాబాద్ కు ఊపిరిగా నిలుస్తోన్న కేబీఆర్ పార్క్ ను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972లోని సెక్షన్ 35 కింద నోటిఫై చేసిన కేబీఆర్ పార్క్ పచ్చటి ఊపిరితిత్తిగా (గ్రీన్ లంగ్) వంటిదన్నారు. అంతేకాకుండా హైదరాబాద్ నగరానికి గుండెకాయ లాంటిదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సున్నితమైన, అత్యంత అరుదైన పర్యావరణ ప్రాంతమైన కేబీఆర్ పార్క్ ను... 2012--2015 మధ్య (హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన గ్రీన్ బఫర్ ఏరియాతో కలిపి) 25-35 మీటర్ల మేర ఎకో సెన్సిటివ్ జోన్ గా గుర్తించారన్నారు. అయినప్పటికీ రోడ్లు, ఇతర ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడితో ఈ పరిధిని క్రమంగా తగ్గిస్తూ వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్ట్రాటజిక్ రోడ్డు డెవలప్ మెంట్ ప్లాన్(ఎస్ఆర్‌డీపీ) నిర్మాణం కోసం, భూసేకరణ వ్యయాన్ని తప్పించుకునేందుకు... ఈ జోన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయ, పర్యావరణ అంచనాలు లేకుండా తగ్గించిందని తెలిపారు. కేవలం 03 నుంచి 29.8 మీటర్లకు కుదిస్తు 2020 అక్టోబర్ 27న నిర్ణయం తీసుకుందని వివరించారు.



**పర్యావరణానికి తీరని నష్టం...** పర్యావరణ పరిరక్షణ కోసం 'షాక్ అబ్జార్బర్'గా పనిచేయాల్సిన ఎకో సెన్సిటివ్ జోన్ ను కుదింపు సరికాదని పిటిషనర్లు వాదించారు. తక్షణమే చెట్ల నరికివేతను అడ్డుకోకపోతే పర్యావరణానికి తీరనినష్టం వాటిల్లుతుందని నివేదించారు. ప్రధానంగా ఎకో సెన్సిటీవ్ జోన్ కుదింపుపై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని హైకోర్టులో విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వమే అంగీకరించిందని తెలిపారు. కానీ, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్‌లో మాత్రం పబ్లిక్ హియరింగ్ చేపట్టినట్లు తప్పుగా పేర్కొందన్నారు. అయితే... పర్యావరణ నిబంధనల సడలింపును వ్యతిరేకిస్తూ 19 వేల మంది స్వచ్ఛందంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ సంతకాలు చేశారన్నారు. కానీ ఈ 19వేల అభ్యంతరాలను సైతం ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. అసలైన ఎకో సెన్సిటీవ్ జోన్ పరిధిలో యథేచ్ఛగా నిర్మాణ పనులు చేస్తున్నారని, దీనికోసం చెట్లను నరికేస్తున్నారని నివేదించారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకొన్న జస్టిస్ నాగరత్న ధర్మాసనం... ఈ పిటిషన్ పై సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

# యు జి డి నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**శేరిలింగంపల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి నగర్ 2 కాలనీ లోని నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ శ్రీ అరేకపూడి గాంధీ సహకారంతో డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పోశెట్టిగౌడ్, నాగేష్ గౌడ్, అభిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ విధానాలపై రాహుల్ గాంధీ ఫైర్



**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ** దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో మోడీ విదేశాల్లో పర్యటిస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో పర్యటించిన ఆయన చురువా హనుమాన్ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. దేశంలో సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని.. ప్రజలను బయటకు వెళ్లొద్దని ప్రధాని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయనేమో ప్రపంచమంతా చుట్టేస్తున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు.ముందుముందు దేశంపై ఒక పెద్ద ఆర్థిక తుపాను విరుచుకుపడబోతోందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. "రాబోయే ఆర్థిక సంక్షోభం అదానీ, అంబానీ, మోడీని ఏమీ చేయలేదు. వాళ్లంతా తమ ప్యాలెస్‌లలో భద్రంగా ఉంటారు. కానీ దేశ యువత, సామాన్య ప్రజలు దీనివల్ల తీవ్రంగా దెబ్బతింటారు. ఇంతకుముందెన్నడూ చూడని భయంకరమైన ఆర్థిక సంక్షోభాన్ని దేశం చూడబోతోంది. కష్టకాలం ముందుంది. మోడీ ఆర్థిక విధానాలే ఇందుకు కారణం" అని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర వడగాలులు



**హైదరాబాద్ :వాస్తవ తెలంగాణ** నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకేలోపే, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ఏపీలో 47 మండలాల్లో తీవ్ర వడగాలులు, 88 మండలాల్లో వడగాలులు వీస్తాయని, తెలంగాణలో 2-3 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, ఉత్తర తెలంగాణలో తీవ్ర వడగాలులు వీస్తాయని తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో, ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని సూచించారు.

# బిఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు

**– కండువా కప్పి ఆహ్వానించిన రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**



**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆకుల అఖిల్ పటేల్ మంగళవారం సీజీఆర్ కార్యాలయంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి అఖిల్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తనను ఆకర్షించాయని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీ నాయకత్వం సూచించిన విధంగా పనిచేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తారా కళాశాలలో మొదటి దశ అడ్మిషన్లు జరుగుచున్నవి




**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాతారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో దోస్తు ద్వారా మొదటి దశలో కేటాయించిన సీట్లకు అడ్మిషన్లు జరుగుచున్నయని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపినారు. తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో దోస్తు ద్వారా మొదటి దశ లో సీటు వచ్చిన విద్యార్థులు తప్పనిసరిగా ఆన్లైన్లో మీ సమీపములోని మీ సేవ కేంద్రాల ద్వారా గాని, ఆన్లైన్ సెంటర్లలో గాని సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని ,అప్పుడే మీ సీటు రిజర్వ్ అవుతుందని ప్రిన్సిపల్ తెలిపినారు. ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవడానికి ఈనెల 23 వ తేదీ వరకు అవకాశం ఉందని, కళాశాలలో సీటు వచ్చినటువంటి విద్యార్థులు తప్పనిసరిగా 23 లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని తెలిపినారు. అదేవిధంగా దోస్త్ రెండవ దశ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేవారు కళాశాలలోని ఏఐడీపీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని, ఈ కోర్సులలో చేరే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపినారు. కళాశాలలో బీకాంలో బీ.కాం. హెచ్.ఆర్; బీ.కాం. బి.ఎఫ్.ఎస్.ఐ; బి.బి. ఏ. రిటైలింగ్; బి ఫార్మసీ కోర్సులు ఏడీపీ కోర్సులని, వీటికి అప్లై చేసుకుంటే రెండు సంవత్సరాలు కళాశాలలో చదివి, మూడవ సంవత్సరము సంబంధిత కంపెనీలలో, ఇతర కంపెనీలు గాని ఉద్యోగం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు. ఈ కోర్సులలో చేరిన విద్యార్థులు చివరి సంవత్సరం నెలకు 5000 నుండి 10000 రూపాయల వరకు స్టైపండు పొంది అవకాశం ఉందని తెలిపినారు. కావున రెండవ దశ అడ్మిషన్ లకు దరఖాస్తు చేసుకునేవారు పై ఏడిపి కోర్సులతోపాటు కళాశాలలోని ఇతర కోర్సులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపినారు. దరఖాస్తులు చెయ్యడంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతే తారా కళాశాలలోని జిల్లా దోస్త్ సెంటర్ ని సంప్రదించాలని కోరినారు.

## అమీర్ బస్తీ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

**జలమండలి జనరల్ మేనేజర్, ఐల కమిషనర్‌లకు వినతి పత్రం సమర్పణ**
**సామాజిక కార్యకర్తలు శ్యామ్, విజయ్ భాస్కర్ రెడ్డి చొరవ**







**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** సాయిబాబా నగర్ 292 డివిజన్ పరిధిలోని అమీర్ బస్తీలో గత నెల రోజులుగా తీవ్ర రూపం దాల్చిన డ్రైనేజీ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న నరకప్రాయమైన ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని సామాజిక కార్యకర్తలు శ్యామ్, విజయ్ భాస్కర్ రెడ్డి అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ ని, ఐల కమిషనర్ ని, అలాగే కొంపల్లి మున్సిపాలిటీ డివిజనల్ ఇంజనీర్ ని స్వయంగా కలిసి అమీర్ బస్తీలో ప్రజలు పడుతున్న దుస్థితిని కూలంకషంగా వివరించారు. ఈ మేరకు వారు అమీర్ బస్తీలో ఐల పరిధిలోకి వచ్చే మూడు ప్రధాన మాన్హోల్స్ పూర్తిగా పగిలిపోవడం వల్లే డ్రైనేజీ నీరంతా రోడ్లపైకి పొంగిపొర్లుతోందని శ్యామ్, విజయ్ భాస్కర్ రెడ్డి అధికారులకు ఆధారాలతో సహా వివరించారు. దీనివల్ల బస్తీ అంతా దుర్వాసన వెదజల్లుతూ, స్థానికులు, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక కార్యకర్తల ఫిర్యాదుతో స్పందించిన అధికారులు ప్రస్తుతం డ్రైనేజీ లీకేజీని తాత్కాలికంగా క్లియర్ చేసినప్పటికీ, సమస్య మళ్లీ మొదటికి రాకుండా ఉండాలంటే పగిలిపోయిన ఆ మూడు మాన్హోల్స్‌కు వెంటనే శాశ్వత ప్రాతిపదికన రిపేర్లు చేపట్టాలని వారు కోరారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని, త్వరగతిన నిధులు మంజూరు చేసి, మాన్హోల్స్ మరమ్మతు పనులు పూర్తి చేస్తామని, అమీర్ బస్తీ ప్రజల ఇబ్బందులను శాశ్వతంగా తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు సామాజిక కార్యకర్తలు బల్లెం శ్యామ్, విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు.

# లౌసియాన రీసర్చ్ యూనివార్సిటీ డా.బి.ఆర్.అంబేద్కర్ జాతీయ అవార్డు తీసుకున్న పెద్ద పట్ల మంజుల



**వాస్తవ తెలంగాణ న్యూస్ పుల్కల్** డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ స్థాయి అవార్డు-2026 సంవత్సరానికి గాను ఢిల్లీ లో జరిగిన కార్యక్రమంలో పెద్దపట్ల మంజుల జాతీయ అవార్డు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అవార్డు ను అందుకుంది ఈ మేరకు ఆదివారం ఆమె కు జాతీయ కమిటీ సభ్యులు , వైష్ణవి జన కళ్యాణ్ ఫౌండషన్ లౌసియాన రీసర్చ్ యూనివార్సిటీ వారు ప్రశంశ పత్రం మరియు మెమెంటో ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరల క్రితం స్థాపించిన లౌసియాన రీసర్చ్ యూనివార్సిటీ లివైష్ణవి జన కళ్యాణ్ ఫౌండేషన్ ద్వారా ప్రతి సంవత్సరం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ సామాజిక కార్యకర్తలకు ఉద్యమకారులకు, రచయితలకు, కవులకు ఈ అవార్డును అందజేస్తున్నామని చెప్పారు. ఇ నెల 17 వ తేది న ఢిల్లీలో జరిగిన ఫెడరేషన్ మహాసభలో డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డును పెద్దపట్ల మంజుల అందుకున్నారు సామాజికంగా, రాజకీయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలను మంజుల చైతన్యవంతం చేస్తున్నారని, ముఖ్యంగా బహుజన రాజ్యాధికార ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కరోనా సమయంలో చాలామంది కి నిత్యావసర వస్తువులతో పాటు మాస్కులను పంపిని చేసి తనకున్న మానవత్వన్ని చాటుకున్నారు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమలను ఇంకా రెట్టింపు చేయాలన్నారు అనంతరం మంజుల మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని, ఇందుకు సహకరించిన సంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు బంటు రామకృష్ణ,కాశపాగ ఇమ్మయ్య గార్లకు ధన్యవాదలు తెలియచేశారు.నా పరిసర ప్రాంతాల ప్రజలకు సేవ చేయాలనే బాధ్యత మరింత పెరిగిందని ఆమె అన్నారు.

# ఘనంగా సుందరయ్య 41 వ వర్ధంతి వేడుకలు

**– కమ్యూనిస్టుల విశిష్టత తెలియజేసిన మహానేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య**
**– పెట్టుబడుదారి, దోపిడి వర్గం మీద పోరాటమే మనం సుందరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి**



**చెన్నూర్, మే 19. (వాస్తవ తెలంగాణ న్యూస్)** : చెన్నూరు మండల కేంద్రంలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య 41 వ వర్ధంతి నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బోడెంకి చందు సిపిఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ.. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ అనాగారిక, పేద ప్రజల కోసం, మహిళల కోసం ఇంటి నుంచే పోరాటాన్ని మొదలుపెట్టి పిల్లలు పుడితే ఉద్యమానికి ఆటంకం, స్వార్ధం పెరుగుతుంది. కుటుంబ నియంత్రణ చేసుకొని నా జీవితాన్ని పేద అణగారిన వర్గాలకు కోసం జీవితం అర్పించి ఎంపీగా పార్లమెంట్ కు సైకిల్ తో వెళ్లిన మహా కార్మిక ఉద్యమ నేత సుందరయ్య, మోడీ చెప్పిన పొదుపు మర్మ ఏమిటంటే పేద ప్రజలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల మరింత పేదలుగా మారుతున్నారని అందుకుగాను బంగారం కొనద్దని, డీజిల్ పెట్రోల్ పొదుపుగా వాడాలని చెప్పకనే చెప్పారు. కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఎండగట్టడంలో ప్రజలు, కార్మికులు, కర్షకులు పోరాటాల ద్వారా ప్రభుత్వాలకు తగిన నేర్పాలని పిలుపునిచ్చారు. కనికరం అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. కూలీలు కార్మికుల అసలు ఎప్పటికప్పుడు పార్లమెంటులో చర్చించి ప్రజల పక్షం నిలిచిన ఆదర్శమైన విలువలతో సమస్యలు వివరించడంలో బూర్జువా పార్టీలకు, కమ్యూనిస్టు పార్టీలకు తేడా తెలియజేసి కుల మతాలకతీతంగా పోరాటం చేసే నాయకులు సుందరయ్యని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, ఆయన నిరాడంబర, నిబద్ధతకు మరోసారి రెడ్ సెల్యూట్ తెలియజేస్తూ, ఈ కార్యక్రమంలో బోన్ల సరిత వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు, నాగజ్యోతి మహిళా సంఘం నాయకురాలు, రమాదేవి, సిపిఎం నాయకులు కృష్ణమాచారి, మహేశ్వరి, బీసీ యూత్ నాయకులు సంజీవ్, బాపురావు, చంద్రశేఖర్, ప్రశాంత్, వంశి తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ నగర్‌లో కలుషిత తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి!

**అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించిన మహ్మద్ రఫీ**
**మ్యాన్‌హోల్స్ లోపల ప్లాస్టరింగ్ చేయాలని అధికారులకు విజ్ఞప్తి**





**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** భగత్‌సింగ్ నగర్‌లో తాగునీటిలో మురుగునీరు కలుస్తున్న తీవ్ర సమస్యను వెంటనే పరిష్కరించాలని సంక్షేమ సంగమ్ నాయకుడు మహ్మద్ రఫీ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి జలమండలి కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో చింతల్ డివిజన్ సమస్యలను ప్రధాన అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో, మంగళవారం జలమండలి అధికారులు సమస్యను పరిష్కరించేందుకు భగత్ సింగ్ నగర్ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఎలమండలి అధికారులతో కలిసి మహమ్మద్ రఫీ సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బొడ్రాయి వీధి నుంచి పోచమ్మ గుడి వీధి వరకు వారం రోజులుగా పలుచోట్ల తాగునీటిలో మురుగునీరు కలుస్తోందని స్థానికులు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కలుషిత నీటి వల్ల అంటువ్యాధులు ప్రబలి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులకు వివరించారు. శాశ్వత పరిష్కారం కోసం సంక్షేమ సంగమ్ నాయకుడు మహ్మద్ రఫీ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు: ప్రధాన పైపులైన్ వెలుపల ప్రవాహ మార్గం నుంచి పైపులను పూర్తిగా శుభ్రపరచాలి తెలిపారు. డ్రైనేజీ మ్యాన్ హోల్ లలో సిమెంట్ తో ప్లాస్టరింగ్ చేయడంతో పాటు, కలుషిత నీటి సరఫరా ఎక్కడ నుండి జరుగుతుందో లీకేజీలు తెలుసుకోవాలన్నారు. అధికారులు తక్షణమే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంగమ్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, సీనియర్ నాయ కులు సంబయ్య, అశోక్, సామ్రాట్, ఉప్పలయ్య, రాములు, సాయి కిరణ్ గౌడ్, చందు, వెంకట్ రెడ్డి, రాము ముదిరాజ్, శ్రీధర్, సుభాష్, బీసు వెంకటేష్, భూపాల్ పంతులు, సురేష్, మల్లేష్, ఆంజనేయులు, కిషన్ పాల్గొన్నారు.

# గుర్రపుడెక్క తొలగింపుపై ప్రశంసల జల్లు!

## వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్
## సీఎంఓ, హైడ్రా, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు





**నిజాంపేట్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ మేడికుంట చెరువుకు ఎట్టకేలకు గుర్రపుడెక్క సమస్య నుండి విముక్తి లభించింది. గత కొంతకాలంగా చెరువును కమ్మేసి, స్థానికులకు తీవ్ర ఇబ్బందిగా మారిన గుర్రపుడెక్కను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగించారు. ఈ సానుకూల చర్యపై స్థానిక ప్రజలు, ప్రగతినగర్ ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో స్పందించి చెరువును శుభ్రం చేయించిన తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (Telangana CMO), నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్, హైడ్రా (HYDRAA) యంత్రాంగానికి స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**సుందరీకరణ పనులు చేపట్టాలి: వాకింగ్ ట్రాక్ ప్రధాన డిమాండ్**

చెరువును శుభ్రం చేయడంపై సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు, ఇదే ఉత్సాహంతో చెరువు చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. ముఖ్యంగా ప్రగతినగర్, నిజాంపేట్ పరిసర ప్రాంతాల ప్రజలు, వృద్ధులు, మార్నింగ్ వాకర్స్ కోసం వేడికుంట చెరువు చుట్టూ ఒక ఆహ్లాదకరమైన 'వాకింగ్ ట్రాక్' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువు కట్టను పటిష్టం చేసి, లైటింగ్, కూర్చునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం మరింత పచ్చదనంతో వికసిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

**రాజకీయ పక్షాల మద్దతు – అధికారుల చొరవ**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై రాజకీయ వర్గాల్లోనూ చర్చ నడుస్తోంది. వేడికుంట చెరువు పునరుద్ధరణ విషయంలో స్థానిక కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా చొరవ చూపారు. బిజెపి సీనియర్ నాయకులు నారపరాజు రాంచందర్ రావు, ఆకుల సతీష్ (బీజేపీ కుత్బుల్లాపూర్) తదితరులు క్షేత్రస్థాయి సమస్యలపై నిరంతరం గళమెత్తుతుండటంతో పాటు, స్థానిక మున్సిపల్ యంత్రాంగం కూడా వేగంగా స్పందించడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపుడెక్కను తొలగించినందుకు ధన్యవాదాలు తెలుపుతూనే, త్వరలోనే వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కుత్బుల్లాపూర్ టైమ్స్ వేదికగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను స్థానిక నివాసితులు కోరుతున్నారు.

# రన్నింగ్ కారులో అకస్మాత్తుగా మంటలు!

## బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పిన బీజేపీ రాష్ట్ర నేత రావుల శేషగిరి





**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం ఉషోదయ కాలనీ ఫేజ్-2 ప్రధాన రహదారిపై మంగళవారం భారీ ప్రమాదం తృటిలో తప్పింది. రోడ్డుపై వెళ్తుండగా ఒక కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి, చూస్తుండగానే వాహనం పూర్తిగా దగ్ధమైంది. సమయస్ఫూర్తితో కారులో ఉన్నవారు వెంటనే కిందకు దూకేయడంతో పెద్ద ప్రాణాపాయం తప్పింది. కారు ఇంజిన్ నుండి ఒక్కసారిగా పొగలు, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే ఫైర్ ఇంజిన్ ఘటనా స్థలానికి చేరుకునే లోపే మంటలు తీవ్రరూపం దాల్చి కారు పూర్తిగా కాలిబూడిదైంది. అనంతరం రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు.

**ప్రమాద స్థలాన్ని సందర్శించిన రావుల శేషగిరి**

రన్నింగ్ కారులో మంటలు చెలరేగిన విషయం తెలియగానే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను, కాలిపోయిన వాహనాన్ని ఆయన పరిశీలించారు."ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్నవారు చాకచక్యంగా బయటపడటం వల్ల పెద్ద ప్రాణనష్టం తప్పింది. బాధితులకు దేవుడి ఆశీస్సులు, కాలనీవాసుల సమయస్ఫూర్తి తోడవ్వడం వల్లే అంతా సురక్షితంగా ఉన్నారు అని మాజీ కార్పొరేటర్"రావుల శేషగిరి అన్నారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గురైన కుటుంబ సభ్యులను శేషగిరి పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. కాలనీల్లో ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, తక్షణమే అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. బాధితులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికలపై బీజేపీ నజర్: బూత్ స్థాయి బలోపేతమే లక్ష్యం

## 'దేశమే ప్రథమం' సిద్ధాంతాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి: పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు





**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** రాబోయే జీహెచ్ఎంసీ (GHMC) ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు కదలాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా బుధవారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ ఎన్నికల సెంట్రల్ అబ్జర్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు, మోర్చా అధ్యక్షులు, ముఖ్య నాయకులతో రాబోయే ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. **ప్రజాక్షేత్రంలోకి కేంద్ర ప్రభుత్వ సుపరిపాలన** సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సుపరిపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకూ తీసుకె ళ్లాలని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు."దేశమే ప్రథమం అనే భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి అని" బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచం దరావు అన్నారు. ఈ కీలక సమావేశంలో బూత్ స్థాయిలో కమిటీలను బలోపేతం చేయడం, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, ఎన్నికల కార్యాచరణను సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ కార్యకర్తలే అసలైన బలమని, వారంతా ప్రజల్లోకి చురుకుగా వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలను వివరించాలని నాయకులు స్పష్టం చేశారు. ఈ సన్నాహక సమావే శంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పద్మయ్య, గిరి వర్ధన్, తేజ ప్రసన్న, సీనియర్ నాయకుడు బాలచందర్, మల్కాజిగిరి పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావుతో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టీల్, ఐరన్ ధరల పెరుగుదలతో సెంట్రింగ్ కార్మికుల ఆందోళన

## నేటి నుంచి పనులు బంద్‌కు పిలుపు
## మర్కుక్ మండల కేంద్రంలో ర్యాలీ, దీక్ష, వంటావార్పు




**గజ్వేల్ నియోజకవర్గం వాస్తవ తెలంగాణ న్యూస్/** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల సెంట్రింగ్ యూనియన్ సభ్యులు మంగళవారం మండల కేంద్రంలో సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల ఐరన్ ధరలు విపరీతంగా పెరగడంతో సెంట్రింగ్ పనులు కొనసాగించడం కార్మికులకు భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సెంట్రింగ్ కార్మికుల రేట్లు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సెంట్రింగ్ పనులను బంద్ చేస్తామని యూనియన్ నాయకులు ప్రకటించారు.ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మండల కేంద్రంలో ఒకరోజు దీక్షతో పాటు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. నేటి నుండి సెంట్రింగ్ పనులు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్‌కు కాంట్రాక్టర్లు, తాపీ కార్మికులు, ఇంటి యజమానులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తాపీ కార్మికుల యూనియన్ కూడా ఈ సమావేశంలో సహాయ సహకారాలు అందించాలని, సహకరించాలని వారు తెలిపారు. బీఎన్ఆర్‌కేఎస్ మర్కుక్ మండల అధ్యక్షులు అంకిరెడ్డిపల్లి నరసింహులు మాట్లాడుతూ కార్మికుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని రేట్లు పెంచడం అత్యవసరమన్నారు. సెంట్రింగ్ యూనియన్ నాయకులు కొంతం కిషన్, ఉపాధ్యక్షులు బాబు, సలహాదారులు నిజాముద్దీన్, ప్రధాన కార్యదర్శి మునిగడప ప్రశాంత్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె మూలన్, ఎస్‌కే పాషా, బక్కల రాజు, ఆసిఫ్, ప్రమోద్ కుమార్, నాగరాజు, దశరథ, స్వామి, కనకయ్య, చంద్రం తదితర కార్మికులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్




**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పలు శాఖల అధికారులతో కలిసి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్‌పల్లి, దేవేందర్ నగర్ ప్రాంతాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలకు సంబంధించిన తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, రహదారులు, వీధిదీపాలు, ఇంటి నెంబర్ల కేటాయింపు తదితర సమస్యలను కాలనీల లబ్ధిదారులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ, పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి వేలాది కుటుంబాలకు అందించామని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుతం ఆయా కాలనీల్లో మౌలిక వసతుల నిర్వహణలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తీవ్రమైన వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోజుకు రెండు సార్లు తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడటంతో పాటు, ప్రమాదాలు నివారించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తక్షణమే భద్రతా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. ప్రతి వీధిలో తగినంత వీధిదీపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా లబ్ధిదారులందరికీ ఇంటి నెంబర్ల కేటాయింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలి, అంతర్గత రహదారుల అభివృద్ధి, రవాణా సౌకర్యాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రజల ఆధ్యాత్మిక, సామాజిక అవసరాల దృష్ట్యా దేవాలయాలు, మసీదులు, చర్చిలతో పాటు వైకుంఠ ధామాల (శ్మశాన వాటికల) నిర్మాణానికి తగిన స్థలాలను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గాజుల రామారం ఉప కమిషనర్‌తో పాటు హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ, ఇంజనీరింగ్ అధికారులు ఎమ్మెల్యే ఆదేశాలపై సానుకూలంగా స్పందించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణమే క్షేత్రస్థాయి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉన్నతాధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జవహర్ నాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ మిస్సింగ్ కేసు నమోదు



**కప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం బాలాజీ నగర్ కు చెందిన ఫిర్యాదుదారుడు అయిన గుగులోత్ ఉపేందర్ నాయక్ తాను ఆర్మీ డెంటల్ కాలేజ్ సమీపంలో రేడియం షాప్ నిర్వహిస్తున్నాడు. తన భార్య అయిన మౌనిక ఇంట్లోనే ఉంటుంది. తేదీ: 18.05.2026 న మధ్యాహ్నం సుమారు 13:30 గంటల సమయంలో భోజనం కోసం ఇంటికి వెళ్లగా, తన భార్య గుగులోత్ మౌనిక, వయస్సు: 22 సంవత్సరాలు, ఇంట్లో కనిపించకుండా పోయినట్లు గమనించాడు. అనంతరం సమీప ప్రాంతాలలో మరియు బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె మొబైల్ ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. తరువాత పొరుగింటి సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా, ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో ఆమె ఒక ఆటోలో వెళ్లినట్లు గుర్తించాడు. అన్ని విధాలుగా వెతికినా ఆమె ఆచూకీ దొరకకపోవడంతో ఉపేందర్ ఫిర్యాదు మేరకు అమౌంట్ చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది.

## చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి శిక్ష ఖరారు..

**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం మల్కాజ్ గిరి కోర్ట్ కేసులో నిందితుడు డొంకని నగేష్ గౌడ్ కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఆరు లక్షల రూపాయలు చెల్లించాలని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.కిరణ్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఘట్కేసర్ మండలం ఔషాపూర్ గ్రామానికి చెందిన డొంకని నగేష్ గౌడ్ 2014 సంవత్సరంలో మూడు లక్షల రూపాయలను మౌలాలికి చెందిన గున్నాల అరుణ్ కుమార్ వద్ద చేబదులుగా తీసుకున్నాడు. అందుకు సంబంధించి చెక్కును అందజేశాడు. ఆ చెక్కు బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయింది. అందుకు సంబంధించి డొంకని నగేష్ గౌడ్ కాలయాపన చేస్తూ వచ్చాడు. న్యాయం కోసం గున్నాల అరుణ్ కుమార్ గౌడ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా 2022 మార్చి ఏడవ తేదీన 19వ అదనపు మెట్రోపాలిటన్ న్యాయమూర్తి పూజా కందుకూరి డొంకని నగేష్ గౌడ్ కు శిక్ష ఖరారు చేసింది. అదనపు మెట్రోపాలిటన్ న్యాయమూర్తి తీర్పు పై నిందితుడు డొంకని నగేష్ గౌడ్ జిల్లా కోర్టును ఆశ్రయించాడు. నిందితుడు డొంకని నగేష్ గౌడ్ అప్పీల్ ను నాల్గవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డి. కిరణ్ కుమార్ కేసును కొట్టివేస్తూ మంగళవారం తీర్పును వెలువరించారు. డొంకని నగేష్ గౌడ్ ఆరు నెలల సాధారణ కారాగార శిక్షను విధించింది. చెక్కు మొత్తం మూడు లక్షల రూపాయలకు రెట్టింపుగా 6 లక్షల రూపాయలు అందజేయాలన్నారు. 2014 సంవత్సరం నుంచి మూడు లక్షల రూపాయలకు గాను సంవత్సరానికి 9 శాతం వడ్డీతో చెల్లించాలని కోర్టు ఆదేశించింది. వచ్చేనెల జూన్ 19వ తేదీ లోపు నిందితుడు డొంకని నగేష్ గౌడ్ ట్రయల్ కోర్టులో లొంగిపోవాలని లేని పక్షంలో నాన్ బెయిలబుల్ వారంటీతో అరెస్ట్ చేసి జైలుకు తరలించాలని ట్రయల్ కోర్టును నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.కిరణ్ కుమార్ ఆదేశించారు.



## నాగారం,దమ్మాయిగూడ దారిలో కూలినా కల్వర్టు ను పూనార్ణిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి..

### మాజీ వర్డ్ సభ్యులు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్..



**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్ /** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండల్ నాగారం డివిజన్ విజయపురి కాలనీ గత కొన్ని సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు కారణంగా విజయపురి కాలనీ నుంచి సింహపురి కాలనీ, టీచర్స్ కాలనీ ,వెంకటేశ్వర కాలనీ, మీదుగా దమ్మైగూడ వెళ్లే మార్గం మధ్యలో కల్వర్టు కూలిపోవడం జరిగింది. ఈ రోడ్డు మీది నుండి ప్రతిరోజు ఎంతోమంది నాగారం నుంచి దమ్మాయిగూడ వెళ్లే మార్గంగా వెళ్లేవారు ఈ బ్రిడ్జిని అధికారులు త్వరగా గా పూర్తిచేసి కాలనీవాసులకి అందుబాటులోకి తేవాలని మాజీ వార్డు సభ్యులు చిన్నం రాజ్ సాయినాథ్ గౌడ్ డిమాండ్ చేశారు.

## ఆశ వర్కర్ల సమస్యతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో వినతి పత్రం ఇచ్చిన ఆశ వర్కర్స్

- ఆశా వర్కర్లకు ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఆశాలకు ఫిక్స్ డ్ వేతనం 18వేలు చెల్లించాలి
- సీఐటీయు ఆధ్వర్యంలో క్యాంప్ ఆఫీస్లో ఎమ్మెల్యే పిఏ కి వినతిపత్రం అందచేశారు



**చెన్నూర్, మే 19. (వాస్తవ తెలంగాణ న్యూస్) :** ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగ చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మంత్రి పిఏ కి ఆశా వర్కర్ల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బోడంకి చందు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఆశా వర్కర్లు గత ఇరవై సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారనీ వీరంతా మహిళలు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులున్నారనీ, నేటికి వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం గ్యారెంటీ ఫిక్సిడ్ వేతనం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయం చేయలేదని అన్నారు. సరోజ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు 15 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అనంతరం వచ్చిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటింది. ఈ కాలంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అయినా నేటికి వేతనాలు పెంచలేదు. 50 లక్షల ఇన్సూరెన్స్, 50వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చినా, ఇంకా అమలు చేయటం లేదు. పి.ఆర్.సి. ఎరియర్స్, లెప్రసీ, పల్సపోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉన్నాయి. కావున పై సమస్యలు పరిశీలించి, ఆశా వర్కర్ల డిమాండ్లను, పరిష్కరించుటకు ప్రభుత్వం తో చర్చించి ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనికరపు అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కావిరి రవి సిఐటియు జిల్లా నాయకులు, నాగజ్యోతి, రమాదేవి సరిత, మహేశ్వరి యూనియన్ నాయకులు మహిళా సంఘం నాయకురాలు, ఆశ వర్కర్లు యూనియన్ నాయకులు విజయలక్ష్మి, సరిత, పద్మ, లలిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# చిల్ మోర్!

## లిక్కర్ ఫుల్ బాటిల్‌పై ₹500 నుంచి 1,000తగ్గుదల



బీర్‌తో సహా లిక్కర్ ధరల తగ్గింపు
మందుబాబులకు ఇక పండగే
ఒక్కో బీరుపై ఏకంగా ₹75 తగ్గింపు
సిద్ధరామయ్య సర్కారు కొత్త పాలసీ
దిగివచ్చిన మద్యం ధరలు
ఎగబడుతున్న ఏపీ, తెలంగాణ బోర్డర్ ప్రజలు

## కన్నడ సర్కార్ కనికరం

మందుబాబులకు తీపి కబురు. రూ.185 ధర కలిగిన కింగఫిషర్ బీర్ ఇప్పుడు రూ.110కే దొరుకుతోంది. దాదాపు అన్ని బీర్లపై గరిష్ఠంగా రూ.75 వరకు ధర తగ్గింది. వేసవి వచ్చిందంటే చాలు బీర్లకు డిమాండ్ పెరుగుతుంది. మండుటెండల్లో చల్లచల్లని బీర్ తాగేందుకు చాలామంది ఇష్టపడ తారు..ముఖ్యంగా యువత ఎక్కువగా తాగుతుంటారు. అయితే ఇటీవలకాలంలో ఆల్కహాల్ ధరలు బాగా పెరగడంతో చాలామంది బీర్లకు దూరమయ్యారు... ఇలాంటి వారికి తాజాగా గుడ్ న్యూస్ అందింది. ఒక్క బీర్ పై ఏకంగా రూ.20 నుంచి రూ.75 వరకు తగ్గింది... సరిగ్గా వేసవి ఎండలు ముదిరిన వేళ ఇలా ధరలు తగ్గించడంతో మందుబాబులు ఆనందానికి అవధులు లేవు. ఇప్పటికే వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి... దీంతో ఆటోమేటిగ్గా నిత్యావసరాల ధరలు కూడా మండిపోతున్నాయి. దీంతో యావత్ దేశ ప్రజలు ఆందోళనకు గురవుతున్న సమయంలో కర్ణాటక ప్రభుత్వం మందుబాబులకు చల్లని కబురు చెప్పింది. ఈ రాష్ట్రంలో బీర్ల ధరలను భారీగా తగ్గించింది... కొన్ని బ్రాండ్లపై రూ.20 నుంచి గరిష్ఠంగా రూ.75 వరకు ధర తగ్గింది.

వాస్తవ తెలంగాణ

### ఆల్కహాల్ శాతాన్ని బట్టి పన్ను విధించే పద్ధతి

కర్ణాటక ప్రభుత్వం ఆల్కహాల్ పై కొత్త పన్ను (ఆల్కహాల్ ఇన్ బేవరేజస్) అనే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అంటే ఆల్కహాల్ శాతాన్ని బట్టి పన్ను విధించే పద్ధతిని ప్రారంభించింది. ఈ మార్పు వల్లే బీర్ కంపెనీలు త మ బ్రాండ్ల ధరలను తగ్గించాయి...

### తక్కువ ధర లిక్కర్ ధరలు పెరుగుదల

కేవలం బీర్ల ధరలే కాదు ఫారిన్ విస్కీ ధరలు కూడా కర్ణాటకలో భారీగా తగ్గాయి. ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే కొన్ని ప్రీమియం విస్కీ బాటిల్స్ పై ఏకంగా 20 శాతం ధరలు తగ్గాయి. జానీ వాకర్ బ్లాక్ లేబుల్, చివాస్ రీగల్ ఫుల్ బాటిల్ ధరలు రూ.5,190 నుంచి రూ.4,100 కు తగ్గాయి. ఈ తగ్గింపు అధిక ఆదాయం, ప్రీమియం బ్రాండ్ మందు సేవించే వర్గాలకు ఊరటనిస్తోంది. బీర్లు, ప్రీమియం విస్కీ ధరలు తగ్గినా లోకల్ విస్కీతో పాటు ఇతర ఆల్కహాల్ ధరలను పెరిగాయి. ముఖ్యంగా తక్కువ ధర ఉండే మందు రేట్లను పెంచి అల్పాదాయ వర్గాలకు షాక్ ఇచ్చింది కర్ణాటక ప్రభుత్వం. ఇండియన్ మేడ్ లిక్కర్ ఒరిజినల్ ఛాయిస్, బ్యాగ్ పైపర్ వంటి బడ్జెట్ విస్కీ బాటిల్ ధరలు 25 శాతం వరకు పెరిగాయి. అంటే తక్కువ ధర మందు మరింత ప్రియం కానుందన్నమాట.



కింగ్‌ఫిషర్ (ప్రీమియం, అల్ట్రా) :
రూ.185 నుంచి రూ.110కి తగ్గింపు (రూ.75 తగ్గింది).

హీనెకెన్ సిల్వర్ (650 ml) :
రూ.270 నుంచి రూ.195కి.. (రూ.75 తగ్గింది).

బడ్ వైజర్ ప్రీమియం :
రూ.225 నుంచి రూ.205కి.. (రూ.20 తగ్గింపు).

యుబి (UB - యునైటెడ్ బ్రూవరీస్)
ఎక్స్‌పోర్ట్ బీర్ ధర కూడా రూ.25 తగ్గింది

### కర్ణాటక సరిహద్దు జిల్లాలకు..

ఎండలు మండిపోతున్న వేళ చల్లటి బీర్ తాగాలనుకునేవారికి ధరల తగ్గింపుతో పండగే. ముఖ్యంగా బీర్ ప్రియులకు సంబరాలు చేసుకునేంత ఆనందంలో ఉన్నారు. అయితే కేవలం కన్నడ ప్రజలకే కాదు కొందరు తెలుగోళ్లకు కూడా బీర్ల ధరల తగ్గింపుతో ఉపశమనం లభించనుంది. కర్ణాటక బార్డర్లోని తెలంగాణ జిల్లాలు నారాయణపేట, గద్వాల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి ప్రజలు కర్ణాటక వెళ్లి తక్కువధరలో బీర్లు తాగే అవకాశం ఉంటుంది. ఇక కర్ణాటకతో బార్డర్ పంచుకునే ఏపీ జిల్లాలు కర్నూల్, చిత్తూరు, అనంతపురం ప్రజలకు కూడా బీర్ల ధరలు తగ్గింపు ఉపయోగపడనుంది. ఇలా కర్ణాటకకు అత్యంత సమీపంలోని తెలుగు ప్రాంతాల మందుబాబులకు బీర్ల ధరల తగ్గింపుతో డబ్బులు ఆదా కానున్నాయి. ఇది వారికి మరింత కిక్ ఇవ్వనుంది.





# ఇంటర్నెట్‌కూ.. టోల్ గేట్!

### అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు షాక్

అండర్ సీ డేటా కేబుల్స్‌పై టోల్ టాక్స్
ఇరాన్ అల్ట్రామోడ్రన్ స్టార్టప్ ఐడియా
టోల్ కట్టకపోతే మీ వైర్లు కట్ చేస్తాం
ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ బంద్ అంటూ హెచ్చరికలు




**వాస్తవ తెలంగాణ** పశ్చిమాసియా యుద్ధ మేఘాలు ఇప్పటికే ప్రపంచాన్ని వణికిస్తుంటే ఇప్పుడు ఇరాన్ మరో అల్ట్రామోడ్రన్ స్టార్టప్ ఐడియాతో అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు ప్యాంట్ తడిచేలా చేస్తోంది. ప్రపంచ సరఫరా దారుల్లో అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి' గుండా వెళ్లే చమురు ట్యాంకర్లకు టోల్ ట్యాక్స్‌లు వేయడం.. బెదిరించడం పాత చింతకాయ పచ్చడి కథ అయిపోయిందని ఇరాన్ భావించినట్టుంది. అందుకే రూటు మార్చి ఈసారి నేరుగా ప్రపంచానికి ఊపిరిగా మారిన 'ఇంటర్నెట్‌కే టోల్ గేట్' వేయాలన్న సరికొత్త మాస్టర్ ప్లాన్‌తో టెహ్రాన్ రంగంలోకి దిగింది.

### గ్లోబల్ ఐటీ కారిడార్లలో భూకంపం

సముద్ర గర్భంలో మైళ్ల కొద్దీ పరుచుకున్న అండర్‌సీ డేటా కేబుల్స్ పై ఫీజులు వసూలు చేయాలని ఇరాన్ గట్టిగా ఆలోచిస్తోందన్న వార్తలు ఇప్పుడు గ్లోబల్ ఐటీ కారిడార్లలో భూకంపం సృష్టిస్తున్నాయి. ప్రపంచమంతా సోఫాలో పడుకుని "ఇన్‌స్టాగ్రామ్ రీల్స్" చూస్తూ "ట్విట్టర్ మీమ్స్" షేర్ చేస్తూ టైమ్ పాస్ చేస్తుంటే.. ఆ డేటా అంతా ప్రవహించే అసలు సిసలైన వైర్లు తమ సముద్రం కింద నుంచే వెళ్తున్నాయని ఇరాన్ ఆలస్యంగా గుర్తించింది. అంతే.. వెంటనే గల్లా పెట్టె తెరిచి "అన్నా... వైర్లు మావయ్యా.. కాస్త టోల్ కట్టి వెళ్లండయ్యా!" అంటూ సరికొత్త డిమాండ్లను తెరపైకి తెచ్చింది.

### సాంకేతిక లోపాలంటూ హెచ్చరికలు



టెక్ దిగ్గజాలకు 'ఇరాన్' మార్క్ మెసేజ్‌లు విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సిలికాన్ వ్యాలీ సామ్రాజ్యాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి టెక్ జెయింట్స్‌కు ఇరాన్ నుంచి ప్రత్యేకంగా 'అంబాసిడర్ లెటర్స్' వెళ్లాయట. ఆ లెటర్స్ సారాంశం సింపుల్‌గా.. కానీ స్ట్రాంగ్‌గా ఉందంటున్నారు. "మీరు గనుక సకాలంలో ఈ డేటా టోల్ ఫీజులు చెల్లించకపోతే.. అంతర్జాతీయ డేటా ట్రాఫిక్‌లో చిన్న చిన్న 'సాంకేతిక లోపాలు' అదేనండీ.. కేబుల్ కట్స్, సిగ్నల్ బ్లాక్స్ రావచ్చు. ఆ తర్వాత మీ ఇష్టం" అని ఇరాన్ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

# పెట్రో మరోసారి... స్వల్పంగా పెరిగిన ధరలు




పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగటం నాలుగు రోజుల్లో ఇది రెండో సారి. మే 15వ తేదీన లీటర్ పెట్రోల్‌పై 3 రూపాయలు.. లీటర్ డీజిల్‌పై కూడా 3 రూపాయలు పెరిగింది. దేశ రాజధాని ఢిల్లీలో 94.77 రూపాయలు ఉన్న పెట్రోల్ ధర 97.77 రూపాయలు.. 87.67 రూపాయలు ఉన్న డీజిల్ ధర 90.67 రూపాయలు అయింది. ధరలు పెరిగాయని బాధపడుతున్న వాహనదారులకు మరోసారి షాక్ తగిలింది. దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ పై 87 పైసలు పెరిగి 98.64 రూపాయలకు చేరింది. డీజిల్‌పై 91 పైసలు పెరిగి 91.58 రూపాయలకు చేరింది. ఢిల్లీతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని మెట్రోపాలిటన్ సిటీలలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ముంబైలో పెట్రోల్‌పై 91 పైసలు..డీజిల్‌పై 94 పైసలు పెరిగింది. కోల్‌కతాలో పెట్రోల్‌పై 96 పైసలు పెరిగి 109.70 రూపాయలు అయింది. డీజిల్‌పై 94 పైసలు పెరిగి 96.07 రూపాయలు అయింది. చెన్నైలో పెట్రోల్‌పై 82 పైసలు పెరిగి 104.49 రూపాయలు అయింది. డీజిల్‌పై 86 పైసలు పెరిగి 96.11 రూపాయలు అయింది.

# ఉజ్జయినికి ప్రమాదం

## పట్టాలు తప్పిన మరో రైలు

షంటింగ్ లైన్‌కు తరలిస్తుండగా బఫర్‌తో ఢీ
దెబ్బతిన్న మూడు బోగీలు
ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన ప్రమాదం

మొన్నరాజధాని ఎక్స్ ప్రెస్‌లో మంటలు అంటుకున్నాయి. నిన్న పాట్నా ఫాస్ట్ పాసింజర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. తాజాగా ఉజ్జయినీ ఎక్స్ ప్రెస్ పట్టాలు తప్పింది. మూడు రోజుల వ్యవధిలో మూడు రైలు ప్రమాదాలు సంభవించడం అసాధారణమే. ఈ ప్రమాదాల్లో ఎవరూ ప్రాణాలను కోల్పోకపోవడం ఊపిరి పీల్చుకునే విషయమే అయినప్పటికీ వరుస ఘటనలు రైల్వే నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నట్టుయింది. వాస్తవ తెలంగాణ

### దెబ్బతిన్న మూడు బోగీలు

తాజాగా సోమవారం రాత్రి ఉత్తరాఖండ్ లో ఉజ్జయిని ఎక్స్ ప్రెస్ ప్రమాదానికి గురైంది. రిషికేష్ యోగనగరి రైల్వే స్టేషన్‌లో షంటింగ్ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మూడు బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ సమయంలో లోపల ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఉజ్జయిని ఎక్స్ ప్రెస్ సాయంత్రం 6 గంటల ప్రాంతంలో యోగనగరి స్టేషన్‌కు చేరుకుంది. ఈ తెల్లవారు జామున 6:15 గంటలకు ఉజ్జయిని వెళ్లవలసి ఉంది. రైలును రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ప్లాట్‌ఫారమ్ నుండి ఖండ్‌గావ్ షంటింగ్ లైన్‌కు తరలిస్తుండగా, ఇంజిన్ షంటింగ్ లైన్ చివరిలోని బఫర్‌ను ఢీకొట్టిందని ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరోజ్ కుమార్ తెలిపారు.



### లోకో పైలట్ నిర్లక్ష్యమే కారణం

బఫర్‌ను ఢీకొట్టడంతో రైలు ఒక్కసారిగా పెద్ద కుదుపుతో ఆగిపోయింది. దీనివల్ల మధ్యలోని ఒక బోగీపై విపరీతమైన ఒత్తిడి ఏర్పడి, అది పూర్తిగా వంగిపోయి పట్టాలు తప్పింది. ఈ ప్రమాదానికి లోకో పైలట్ నిర్లక్ష్యమే కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. దీనిపై రైల్వే అధికారులు ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. సమాచారం అందిన వెంటనే రైల్వే, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, పోలీసులు సహా పలు విభాగాల అధికారులు, సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో రైల్వే స్టేషన్ లో ఒక లైన్ ను పూర్తిగా మూసివేశారు. ఫలితంగా ఇతర రైళ్ల రాకపోకల్లో జాప్యం నెలకొంది.



# ప్రాజెక్ట్ లపై..రేవంత్ దృష్టి


- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు భూసేకరణకు ఆదేశం
- మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం సమీక్ష
- సాగునీటి పథకాలపై దిశానిర్దేశం

**వాస్తవ తెలంగాణ** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని మంత్రులను, ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్ర కార్యాలయంలో మంగళవారం నాడు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలయినంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని చెప్పారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లిం పులు జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

### పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు సిద్ధం

జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## గీతం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'ఫ్యూచర్ ఎక్స్5'



**వటాన్ చెరు వాస్తవ తెలంగాణ న్యూస్** పరిశ్రమకు సంబంధించిన జ్ఞానాన్ని, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నైపుణ్యాలను విద్యార్థులకు అందించడానికి 'ఫ్యూచర్ ఎక్స్5' పేరిట ఒక చైతన్యవంతమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల శ్రేణికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టింది. గీతంలోని శిక్షణ, మార్గద౯ర్శకత్వం, వృత్తి మార్గదర్శకత్వ డైరెక్టరేట్ (టీఎం సీజీ)లోని శిక్షణ, సామర్థ్య వికాస (టీసీడీ) విభాగం దీనిని ఏర్పాటు చేస్తున్నటు డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, ప్రాజెక్టు మేనేజ్ మెంట్, క్వాంటం కంప్యూటింగ్, కార్పొరేట్ రెడీనెస్, ఎథికల్ హ్యాకింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల నుంచి అనుభ వజ్ఞులైన నిపుణులను తీసుకురావడం ద్వారా విద్య, పరిశ్రమ అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమ లక్ష్యంగా డాక్టర్ రోజీనా వివరిం చారు.మే 23 నుంచి జూన్ 6 వరకు నిర్వహిం చనున్న ఈ సెషన్లు, ప్రతివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయ న్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఆచరణాత్మక అవగా హన పొందడం, ప్రముఖ సంస్థల నిపుణులతో సంభాషించడం, ప్రస్తుత మార్కెట్ పోకడలను అర్థం చేసుకోవడం, వారి వృత్తిపరమైన, కెరీర్ సంసిద్ధతను మెరుగుపరచుకోవడం వంటివి చేస్తారని డాక్టర్ రోజీనా తెలిపారు.మే 23న వినియో గదారు సంబంధాల నిర్వహణ (సీఆర్ఎం), ప్రాజెక్ట నిర్వహణలను విల్ కామ్ డెలివరీ మేనేజర్ శశిధర్ కొండూరి పరిచయం చేస్తారన్నారు. మే 30న క్వాంటం కంప్యూటింగ్, భద్రతను ఈవై డైరెక్టర్ మూర్తి పరవశివం వివరి స్తారని తెలిపారు. మే 31న కార్పొరేట్ సంస్కృతిని అర్థం చేసుకోవడం, ఇంటర్వ్యూ నైపు ణ్యాలు, ఉత్పాదకత, స్వీయ బ్రాండింగ్ లపై ఎంఎక్స్4 భాగస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గురుసిద్ధయ్య శిక్షణ ఇస్తారన్నారు. జూన్ 6న నైతిక హ్యాకింగ్ ను లిబరల్ సెక్యూరిటీ వ్యవస్థా పకులు సుజయ్ గంకిడి పరిచయం చేస్తారని డైరెక్టర్ వివరించారు.పరిశ్రమ భవిష్యత్తు పోకడ లను అన్వేషించడానికి, వృత్తిపరమైన సామ ర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి, అభివృద్ధి చెందుతున్న కెరీర్ రంగాలకు తమను తాము సిద్ధం చేసుకోవడానికి ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయా సెషన్లలో చురుకుగా పాల్గొనాలని డాక్టర్ రోజీనా మాథ్యూ సూచించారు.

GITAM
DEEMED TO BE UNIVERSITY

## పటాన్‌చెరు నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ న్యూస్** పటాన్‌చెరు నియోజకవర్గంలో ముమ్మరంగా సాగిన మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన.ఒకేరోజు రూ.84 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.ప్రతి మున్సిపాలిటీకి రూ.15 కోట్ల భారీ నిధుల విడుదల.పటాన్‌చెరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి నేడు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ప్రజలు వేలాదిగా తరలివచ్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మొత్తంగా నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.84 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.అలాగే భానూర్‌లో రూ.8.30 కోట్ల వ్యయంతో విశాఖ పీడబ్ల్యూడీ రోడ్డు నుండి శంకరపల్లి--పటాన్‌చెరు రోడ్డు వరకు కంచర్లగూడెం మీదుగా నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు.తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కేజీబీవీలో రూ.60.94 లక్షలు, జిన్నారం కేజీబీవీలో రూ.70.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన చేసి, సోలక్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ 1985లో స్వర్గీయ ఇందిరాగాంధీ ఈ ప్రాంతానికి బీడీఎల్, ఓడీఎఫ్ వంటి ప్రతిష్టాత్మక రక్షణ రంగ పరిశ్రమలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆమె సేవలను స్మరించుకుంటూ ఈ ప్రాంతంలో ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమన్నారు.భానూర్ కార్మికుల హౌసింగ్ సొసైటీకి స్థల కేటాయింపు చేపడతామని, పటాన్‌చెరు నుండి శంకర్‌పల్లి వరకు 100 ఫీట్ల రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో లేని విధంగా ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, జూన్ 2వ తేదీ నుండి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పటాన్‌చెరు అభివృద్ధికి, ముఖ్యంగా విద్యా మరియు మౌలిక వసతుల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఒకేరోజు రూ.84 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టి జి ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి , స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

